క్లుప్తంగా

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

తిప్పర్తి : వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్‌బాబు, డాక్టర్ మమత, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

15న మండల మహాసభ

మునుగోడు: మండలంలోని సింగారం గ్రామంలో ఈ నెల 15న నిర్వహించనున్న సీపీఐ 15వ మండల మహాసభకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుర్జ రామచంద్రం కోరారు. బుధవారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, సురిగి చలపతి, ఉప్పునూతల రమేష్, గొసుకొండ లింగయ్య, ఈదులకంటి కైలాస్, కాయితం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ధరల అదుపులో విఫలం

చిట్యాల: నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ చిట్యాల మండల కార్యదర్శి ఎండీ.అక్బర్ విమర్శించారు. చిట్యాలలో బుధవారం జరిగిన ఆ పార్టీ చిట్యాల పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ పట్టణ కార్యదర్శి షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గుండాల సత్తయ్య, దండిగ నర్సింహ, బాల్‌రెడ్డి, రామలింగయ్య, దేవేందర్ పాల్గొన్నారు.

మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల జీపీ పరిధి ఎస్ఎల్‌బీసీ కాలనీకి చెందిన మాదగోని లోకేష్, పెద్దోనిబాయి గ్రామానికి చెందిన రాచకొండ నిఖిల్ మంగళవారం శాలిగౌరారం మండలం మాదారంకలాన్ గ్రామ శివారుల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉన్న మృతదేహాలపై పూలమాలలు వేసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, పెద్ది సుక్కయ్య, పెద్ది యాదగిరి, బెజవాడ సైదులు, ముత్యాల లింగయ్య ఉన్నారు.

టీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ



కట్టంగూర్ : తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎమ్మార్పీఎస్) జిల్లా అధ్యక్షుడిగా కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన ఊట్కూరి కృష్ణ నియమితులయ్యారు. టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటిక రాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీపీఐ పట్టణ కమిటీ ఎన్నిక

నల్లగొండ టౌన్: సీపీఐ నల్లగొండ పట్టణ కమిటీని బుధవారం నల్లగొండలోని మగ్దూం భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శిగా కొర్ర సైదిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా వి.లెనిన్, గాదెపాక రమేష్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా బి.నర్సింహ, మదార్, ముండ్ల ముత్యాలు, సింగపంగ యాదయ్య, జి.లక్ష్మయ్య, అక్కలయ్య, కె.ప్రద్యుమ్నారెడ్డి, రెవల్లి యాదయ్య, పి. సుజాత, జె.విజయ, ఎం.కౌసల్య, చింత ధనలక్ష్మి, ఎస్.ఆర్.సి. రాజు, గుండె రవి ఎన్నికయ్యారు.

మాజీ సర్పంచ్ మృతి



అర్రూరి వీరయ్య

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ అర్రూరి వీరయ్య(74) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. వీరయ్య వెలిమినేడు గ్రామ సర్పంచ్‌గా 1995 నుంచి 2000 వరకు, 2006 నుంచి 2011 వరకు రెండు పర్యాయాలు, మరో ఏడాది పాటు గ్రామ పర్సన్ ఇన్‌చార్జ్‌గా సీపీఎం మద్దతుతో పనిచేశారు. అదేవిధంగా ఉప సర్పంచ్‌గా, సింగిల్ విండో చైర్మన్‌గా పనిచేశారు. సీపీఎం డివిజన్ కమిటీ సభ్యుడిగా కూడా విధులు నిర్వర్తించారు. ఆయన కుమారుడు శ్రీశైలం బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడిగా ఉన్నారు. వీరయ్య మృతదేహాన్ని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేష్, మండల నాయకులు అర్రూరి శ్రీనుతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

ఇన్‌చార్జ్ పాలనతో ఇక్కట్లు..!

- కమిషనర్‌తోపాటు ముఖ్యమైన పోస్టుల్లో అందరూ ఇన్‌చార్జ్‌లే
- సిబ్బందిపై అదనపు పనిభారం
- ఇబ్బందులు పడుతున్న చిట్యాల పట్టణ ప్రజలు

చిట్యాల: మున్సిపల్ కమిషనర్‌తోపాటు ఇతర ముఖ్యమైన విభాగాలకు అధికారులు లేకపోవడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు. దీంతో కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులపై అదనపు భారం పడుతోంది. మున్సిపాలిటీలో ఉన్న కొద్దిపాటి సిబ్బందితోపాటు ఇన్‌చార్జ్ అధికారులతోనే పాలన కొనసాగుతోంది. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న చిట్యాలను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ 15 ఆగస్టు 2018న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం కొన్ని రోజుల పాటు మున్సిపాలిటీలో అధికారుల పాలన కొనసాగింది. ఆ తరువాత జనవరి 2020లో మున్సిపాలిటీ పాలకవర్గానికి మొట్టమొదటిసారి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఏడాది జనవరితో మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగిసింది. ప్రభుత్వం మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించపోగా మున్సిపాలిటీ నిర్వహణకు, అవసరాలకు అనుగుణంగా అధికారులను కేటాయించలేదు.

అందరూ ఇన్‌చార్జ్‌లే..

ప్రస్తుతం చిట్యాల మున్సిపాలిటీలో మున్సిపల్ మేనేజర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, పద్నాలుగు మంది వార్డు ఆఫీసర్లు, ఆరుగురు బిల్ కలెక్టర్లు, అరవై మంది పారిశుద్ధ్య సిబ్బంది, వాటర్‌మెన్‌లు పనిచేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన పి.వీరేందర్ గత నెల 15వ తేదీన బదిలీ అయ్యారు. దీంతో చిట్యాలకు అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న నందికొండ మున్సిపల్ కమిషనర్ శ్రీనుకు ఇన్‌చార్జ్‌గా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. మున్సిపల్ సిబ్బంది వ్యవహారాలు జీతభత్యాల నిర్వహణ అధికారి ఆర్వో(రెవెన్యూ అధికారి) పోస్టు ఖాళీగా ఉండడంతో మున్సిపల్ మేనేజర్‌గా ఉన్న నుజ్హత్ ఫాతిమా ఇన్‌చార్జ్ ఆర్వోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతేకాకుండా మున్సిపాలిటీలో అతి ముఖ్యమైన పారిశుద్ధ్య నిర్వహణ విధులు నిర్వహించే శానిటరీ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) పోస్టు ఖాళీ ఉండడంతో వార్డు ఆఫీసర్ శ్రవణ్ ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మున్సిపాలిటీలో అన్ని రకాల దరఖాస్తులు స్వీకరించేందుకు, ఆన్‌లైన్ సేవలు, సిటిజన్ చార్టర్ నమోదు, ఇతర సేవలు అందించేందుకు పౌర సేవా కేంద్రం ఇన్‌చార్జ్ అధికారి విధులను వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు నిర్వహిస్తున్నారు. నకిరేకల్ మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న గౌతమ్ చిట్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్నారు. నల్లగొండ మున్సిపాలిటీలో మెప్మా విభాగం టీఎంసీ అధికారి సరిత చిట్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ టీఎంసీగా విధులు నిర్వహిస్తున్నారు. పలు మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ అధికారిగా ఉన్న శివ చిట్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ టీపీఓగా విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు ముఖ్యమైన విభాగాలకు ఉద్యోగులు లేక మున్సిపాలిటీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులతోపాటు ఇతర విభాగాల సిబ్బంది అదనపు పనిభారంతో ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చిట్యాల మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టులకు రెగ్యులర్ ఉద్యోగులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయం

రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలి



చిట్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో అవసరాల మేరకు ఉద్యోగులను ప్రభుత్వం నియమించలేదు. దీంతో ప్రజల అవసరాలకు అనుగుణంగా వేగవంతంగా పనులు జరగడం లేదు. మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వెంటనే రెగ్యులర్ ఉద్యోగులను ప్రభుత్వం నియమించాలి.

– కందాటి రమేష్‌రెడ్డి, చిట్యాల

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు



నకిరేకల్ : స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం



రామగిరి(నల్లగొండ): బ్రహ్మంగారి గుట్టపై వేడుకల్లో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని బ్రహ్మంగారి గుట్టపై శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధన ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. మూడు సంవత్సరాలుగా స్వామివారి ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నామని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్ తెలిపారు. వీరబ్రహ్మేంద్ర స్వామి సజీవ సమాధి నిష్ట వహించిన పవిత్ర దినంగా ఆరాధన ఉత్సవాలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముందుగా గణపతి పూజ పుణ్యావచనం, మండపారాధన బ్రహ్మంగారి శతక టాభిషేకం పంచామృతాషేకాలు, శుద్యోదక స్నానం స్వామివారికి పట్టువస్త్రాల అలంకరణ అనంతరం స్వామివారి దివ్య దర్శనాన్ని జరిపించారు. అర్చకులు కే వెంకటేష్ శర్మ ఆధ్వర్యంలో వారి శిష్య బృందం పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి పెండోట సోమ, సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడు కొండోజు కృష్ణమాచారి, శ్రీపాద కృష్ణమాచారి, కన్వీనర్ దాసోజు యాదగిరి, మాజీ కౌన్సిలర్ దాసోజు అరుణ, కో కన్వీనర్ పగిడిమర్రి వెంకటాచారి, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు, సేవా సంస్థ ఆర్థిక కార్యదర్శి నరేంద్రబాబు, కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ అధ్యక్షుడు కొత్తపల్లి రాములు, పోలోజు శ్రీనివాస్‌చారి, కుపోజు వెంకటాచారి, భీష్మాచారి, కొండోజు కోటేశ్వరమ్మ, పర్వతం, విజయలక్ష్మి, మమత, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

నకిరేకల్ : పట్టణంలో శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గణపతి పూజ పుణ్యాహవాచనం అనంతరం కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మోపూరి చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు రాచకొండ సునీల్, పొడుగు స్వాతి, గాజుల సుకన్య, ఆలయ కమిటీ ప్రతినిధులు సంకోజు నారాయణ, నాగోజు శ్రీనివాసాచారి, సిద్దోజు భిక్షమాచారి, తాటికొండ లక్ష్మయ్య, రామకోటి, నర్సయ్య, బ్రహ్మాచారి, పిచ్చయాచారి, సత్యనారాయణచారి, సీతా రాములు, జేజయ్యాచారి, వెంకటాచారి పాల్గొన్నారు.

కొనుగోళ్లు త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

రామగిరి(నల్లగొండ): ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండ మండలంలోని కంచనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గన్నీ బ్యాగులు, లారీలు కొరత లేకుండా చూసుకోవాలని డీఎం హరీష్‌కు సూచించారు. కార్యక్రమంలో డీసీఓ పంచ్యానాయక్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నంరాజు, తహసీల్దార్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు

నార్కట్‌పల్లి : రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. నార్కట్‌పల్లి మండలం శాపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని లారీల్లో మిల్లులకు తరలించే సమయంలో రైతులు ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వవద్దన్నారు. అకాల వర్షం వల్ల ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తక్షణమే తరలించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తరలించే లారీల వివరాలను రికార్డుల్లో సక్రమంగా పొందుపరచకపోవడంపై కేంద్రం నిర్వాహకులు, సంబంధిత శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీల సంఖ్య పెంచాలని రైతులు కోరడంతో ప్రతి రోజు రెండు లారీల్లో కేంద్రం నుంచి ధాన్యాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారును ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే రైతులు నేరుగా తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేయాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్, నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి పత్యానాయక్, తహసీల్దారు వెంకటేశ్వర్ రావు, రామలింగయ్య, ఆర్ఐ తరుణ్, ఏపీఎం శ్రీదేవి, తదితరులున్నారు.



నార్కట్‌పల్లి : శాపల్లి ఐకేపీ కేంద్రంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

వైభవంగా వాసవీమాత జయంతి వేడుకలు

రామగిరి(నల్లగొండ): వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలను నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్‌లో గల రామకోటి స్థూప ఆలయంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, ఒడిబియ్యం అమ్మవారి పారాయణం, 108 రకములతో నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా నగరోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ఓరుగంటి పరమేశ్, ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటేశ్వర్లు, కోశాధికారి కుక్కడపు శ్రీనివాస్, ప్రోగ్రాం కన్వీనర్ మేడం విశ్వప్రసాద్, వ్యవస్థాపక చైర్మన్ రేపాల భద్రాద్రి రాములు, మాజీ చైర్మన్లు మిట్టపల్లి గోవర్ధన్, పారేపల్లి శ్రీనివాస్, బండారు వెంకటేశ్వర్లు ఆలయ గౌరవ సభ్యులు పాల్గొన్నారు.



రామగిరి(నల్లగొండ) : వాసవీమాత రథోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు

వాసవీభవన్‌లో ..

నల్లగొండ పట్టణంలోని వాసవీభవన్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యామా మురళి, కోటగిరి దైవాదీనం, భూపతి రాజు, కోటగిరి చంద్రశేఖర్, గుబ్బా శ్రీనివాస్, లక్ష్మీ, శక్తి శ్రీనివాస్, వనమా మనోహర్, నల్లగొండ శ్రీనివాస్, వనమా రమేష్, గజవెల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్ : వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా నకిరేకల్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్టుకు అభిషేకాలు, అలంకరణ, ఉత్సవమూర్తికి సామూహిక అభిషేకాలు చేశారు. కలశస్థాపన, కుంకుమార్చన, అమ్మవారి ఒడిబియ్యం పోసే కార్యక్రమాలు ఘనంగా జరిపించారు. ఈ వేడుకల్లో ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు బ్రహ్మదేవర పద్మావతి, బ్రహ్మదేవర లక్ష్మయ్య, నర్సింహారావు, ఆర్యవైశ్య పట్టణ, మండల, యువజన విభాగాల అధ్యక్షులు గజ్జల రామకృష్ణ, వీరవెల్లి రఘునాథ్, కందగట్ల సంతోష్, రేపాల కల్యాణి, శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గుండా వెంకటయ్య, ప్రతినిధులు వీర్లపాటి నర్సింహారావు, గర్రె మురళి మోహన్, రేపాల సతీష్, గుండా పద్మ, శోభ, బ్రహ్మదేవర వేణు, రాజు తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్ : వాసవీమాత ఆలయంలో ఉత్సవమూర్తిని దర్శించుకుంటున్న భక్తులు

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

చిట్యాల: మండలం పెద్దకాపర్తి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్)లో పనిచేసిన నలుగురు కూలీలకు రోజుల తరబడి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన నీలకఠం కావ్య (జాబ్‌కార్డు 2329221), బత్తుల లక్ష్మమ్మ (జాబ్ కార్డు 010990), అనగంటి శైలజ (జాబ్‌కార్డు 01011004), ఏర్పుల భాగ్య (జాబ్‌కార్డు 101011008)లు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి సుమారు యాభై రోజులకుపైగా ఉపాధి హామీ పనులకు వెళ్లారు. వీరితో వెళ్లిన వారికి వేతనాలు వచ్చినప్పటికీ ఈ నలుగురికి వేతనాలు మాత్రం అందలేదు. ఈ విషయమై ఉపాధి హామీ అధికారులను ప్రశ్నించగా ఎన్ఆర్ఈజీఎస్‌కు చెందిన సాఫ్ట్‌వేర్‌లో వీరి ఆధార్ అథార్టికేషన్‌తో పాటు ఎంపీఈసీఐ మ్యాపింగ్ బ్యాంకు అకౌంట్‌కు లింకేజీ కాకపోవడంతో వేతనాలు రావడం లేదని తెలిపారు. ఈ విషయం తెలియని వీరు ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల వరకు సుమారు యాభై రోజులకుపైగా పని చేశారు. గతంలో ఉమ్మడి కుటుంబంలో ఉన్నప్పుడు ఉన్న జాబ్‌కార్డులను ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు తొలగించి వీరికి ప్రత్యేకంగా జాబ్ కార్డులను జారీ చేశారు. కానీ వీరి బ్యాంకు, ఆధార్ అకౌంట్ గతంలో జాబ్‌కార్డు కలిగి ఉన్న అకౌంట్‌కు లింకేజీ ఉండడంతో నూతన జాబ్‌కార్డుతో చేసిన పనులకు వేతనాలు జమ కావడం లేదు. ఈ విషయాన్ని కూలీలకు ఆ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ తెలపకపోవడంతో వేతనాలు నిలిచిపోయాయి. అంతేకాకుండా ప్రస్తుతం ఆధార్, బ్యాంకు అకౌంట్‌కు లింకేజీ చేసినప్పటికీ గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చిలకు సంబంధించిన వేతనాలను వచ్చే పరిస్థితి ఉండదని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పేర్కొన్నారు. ఆధార్, బ్యాంకు లింకేజీ చేసుకున్నట్లయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో చేసిన పనులకు మాత్రమే వేతనాలు వచ్చే అవకాశం ఉంది. కాగా తాము పనిచేసిన యాభై రోజులకుగాను వేతనాలను అందించాలని ఉపాధి హామీ పనులు చేసిన కూలీలు అధికారులను కోరుతున్నారు. ఈవిషయమై ఏపీఓ శ్రీలత వివవణ కోరగా.. పెద్దకాపర్తి గ్రామంలోని నలుగురు ఉపాధి హామీ కూలీలు గతంలో ఉమ్మడి కుటుంబ సభ్యులతో జాబ్ కార్డులు కలిగి ఉండే వారని.. వారికి ప్రత్యేకంగా కొత్త జాబ్‌కార్డులు జారీ చేశామన్నారు. వీరి ఆధార్, ఎంపీసీఈసీఐ మ్యాపింగ్ బ్యాంకు అకౌంట్‌కు లింకేజీ కాకపోవడంతో వేతనాలు రిజెక్టు అవుతున్నాయని తెలిపారు. కూలీలు వారి ఆధార్‌కార్డులను బ్యాంకు అకౌంట్‌లకు లింకేజీ చేసుకున్నట్లయితే ఈ ఆర్థిక సంవత్సరంలో పనిచేసిన రోజుల వరకు వారికి వేతనాలు వస్తాయని తెలిపారు.

అంతర్జాతీయ పోటీలకు పలివెల క్రీడాకారుడు ఎంపిక



శివకుమార్

మునుగోడు: అంతర్జాతీయ బేస్‌బాల్ క్రీడా పోటీలకు మునుగోడు మండలంలోని పలివెల గ్రామానికి చెందిన గుత్తి శివకుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 15వ తేదీ నుంచి 21 వరకు ఇరాన్ దేశంలో జరిగే వెస్ట్ ఏసియా కప్- 2025 చాంపియన్‌షిప్ పోటీల్లో ఇండియా తరఫున శివకుమార్ ఆడనున్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన శివకుమార్ బేస్‌బాల్ పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. అతడి ప్రతిభ గుర్తించిన బేస్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వాహకులు ఇరాన్‌లో జరిగే పోటీలకు ఎంపిక చేశారు.

ఆర్థికసాయం అందించిన నేతలు..

ఇరాన్ దేశంలో జరిగే క్రీడా పోటీల్లో ఆడేందుకు అవకాశం దక్కినా అక్కడికి వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో శివకుమార్‌కు మునుగోడు మండలానికి చెందిన పలువురు నేతలు రూ.లక్ష 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వెదిర పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిర మేఘారెడ్డి రూ. 50వేలు, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి రూ.20వేలు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వట్టికోటి శేఖర్ రూ.50వేల చొప్పున అందించారు.

రేషన్‌షాపులకు సరఫరా కాని బియ్యం!

చిట్యాల: మే నెల వచ్చి వారం రోజులు దాటిపోయినా పౌర సరఫరాల శాఖ ద్వారా చిట్యాల మండలంలోని రేషన్ షాపులకు రేషన్‌బియ్యం బుధవారం వరకు చేరలేదు. చిట్యాల మండలవ్యాప్తంగా 32కు పైగా రేషన్ షాపులు ఉన్నాయి. వీటిలో ఐదు రేషన్ షాపులకు మినహాయిస్తే మిగిలిన రేషన్ షాపులకు రేషన్ బియ్యం సరఫరా లేదు. పౌర సరఫరాల శాఖ డిపోల నుంచి రేషన్ షాపులకు లారీల ద్వారా బియ్యం సరఫరా కావాల్సి ఉంటుంది. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలించే ట్రాన్స్‌పోర్టుదారు, రేషన్ షాపులకు బియ్యం తరలించే ట్రాన్స్‌పోర్ట్ టెండరుదారుడు ఒక్కరే ఉన్నారు. ఆ వ్యక్తి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలించేందుకు లారీలను పంపిస్తుండడంతో రేషన్ షాపులకు రేషన్‌బియ్యం తరలింపులో జాప్యం జరుగుతోంది. బియ్యం వెంటనే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.ఈ విషయమై చిట్యాల తహసీల్దార్ కృష్ణనాయక్ వివరణ కోరగా..కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపు, రేషన్‌షాపుల్లో బియ్యం సరఫరాకు లారీలు ట్రాన్స్‌పోర్ట్ చేసే టెండరుదారుడు ఒక్కరే ఉండడంతో రేషన్‌బియ్యం తరలింపులో జాప్యం జరుగుతోందని తెలిపారు. మండలంలోని అన్ని రేషన్‌షాపులకు రేషన్ బియ్యం వెంటనే సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

రామగిరి (నల్లగొండ) : పట్టణంలోని సాయి నగర్‌లో శ్రీ శిర్డీ సాయిబాబా మందిరం 12వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కాగడహారతి, విఘ్నేశ్వర పూజ, శివాభిషేకం, మూలవిరాట్ సాయిబాబాకు అభిషేకం అలంకరణ, అనంతరం సాయిబాబా దివ్య దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ బుర్రి భూపతి రెడ్డి, వైస్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోటిరెడ్డి, నాగేశ్వరరావు గున్నగోని పరమేశం, పబ్బుతిరెడ్డి రెడ్డి దేవేందర్‌రెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం



ముషంపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

రామగిరి(నల్లగొండ): మండలంలోని ముషంపల్లిలోని బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి రాశుల మధ్య వర్షపు నీరు నిలిచింది. పలువురు రైతుల ధాన్యం రాశులు నీటిలో మునిగిపోయాయి. సుమారు 10 వేల క్వింటాళ్ల ధాన్యం ఉంటుంది.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

రామగిరి(నల్లగొండ): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులందరూ పాల్గొనాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పోలె సత్యనారాయణ కోరారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి అనురాధ, దండ పుష్పలత, వేముల ఇందిర పాల్గొన్నారు

చిట్యాల: ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు తేరటుపల్లి హన్మంతుకు, మున్సిపల్ కమిషనర్ శ్రీనుకు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో జడల నర్సింహ, బాకీ అండాలు, జిట్ట నరేష్, దుర్గేష్, కిషన్, లింగస్వామి, పద్మ, ఏళ్ళ మారయ్య, తిరుపతి, నారాయణరెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.



రామగిరి(నల్లగొండ): సమ్మె నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

జెండా ఆవిష్కరణ

నకిరేకల్ : కార్మిక అమరవీరుల స్ఫూర్తితో కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ కోరారు. చందుపట్ల గ్రామంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మేడే వారోత్సవాల్లో ఆయన పాల్గొని జెండా ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వనం చందర్‌రావు, మాజీ ఎంపీటీసీలు ఇమడపాక లక్ష్మీ వెంకన్న, గోనె నర్సింహారావు, ఆలకుంట్ల యాదగిరి, తండు సత్తయ్య, ఆలకుంట్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈదులూరులో..

కట్టంగూర్ : ఈదులూరు గ్రామంలో మేడే వారోత్సవాల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ పాల్గొని కార్మిక జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెంజర్ల సైదులు, పొన్న అంజయ్య, మురారి మోహన్, స్వప్న, తవిటి వెంకటమ్మ, వెంకన్న, పున్న ఆగయ్య, గుడుగుంట్ల రామకృష్ణ, విజయలక్ష్మి, భిక్షం, లింగయ్య ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నార్కట్‌పల్లి : మండలంలోని ఏపీ లింగోటం గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎక్సైజ్ అధికారి దశరథ సమక్షంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. గౌడ సంఘం అధ్యక్షుడిగా పంతంగి జానయ్య, ఉపాధ్యక్షులుగా పంజాల శేఖర్‌గౌడ్, కార్యదర్శిగా బంధారపు అజయ్‌చంద్ర గౌడ్, కోశాధికారిగా పాలకూరి నరేష్ , డైరెక్టర్లుగా కొమ్మగోని నరేష్‌గౌడ్, బజార్, ధనుంజయ, రమేష్ , గంధమల్ల రాజేష్ ఎన్నికయ్యారు.

కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత తీర్చాలి

మునుగోడు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత తీర్చాలని చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ అధికారులను కోరారు. బుధవారం మునుగోడు మార్కెట్ యార్డులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. చండూరు మార్కెట్ పరిధిలోని మునుగోడు, చండూరు, గట్టుప్పల్ మండలాల్లో ఈ ఏడాది అధిక ధాన్యం దిగుబడి వచ్చిందని, అందుకు సరిపడా లారీలు కేటాయించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. లారీ ట్రాన్స్‌పోర్టు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా సమస్య అధికమైందన్నారు. కాంట్రాక్టర్‌ను తొలగించి నూతన కాంట్రాక్టర్‌కు ధాన్యం సరఫరా బాధ్యత అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మార్కెట్ డైరెక్టర్లు కుంభం చెన్నారెడ్డి, హైమద్, నాయకులు రాజేష్, పాపయ్య పాల్గొన్నారు.